

**ఆదివారం, 20. 11. 2011**

# హ్యూమర్ బాక్స్



నిర్వహణ : జోసెఫ్

## మీకు తెలుసా!

### మొట్టమొదటి నిఘంటువు

"నిఘంటువు'ను ఆంగ్లములో 'డిక్షనరీ' అంటారు. 'డిక్షనరీ' అనే పదం 'డిక్షనేరియస్' అనే వాటిన్ శబ్దం నుండి వచ్చింది.' డిక్షనేరియస్' అంటే మాటల సముదాయం. డిక్షనరీలలో అక్షరమాల ప్రకారమే కాక వాటి ఉచ్ఛారణలు, అర్థాలు, వ్యుత్పత్తుల (etymLogy) లను తెలిపే విధంగా ఉంటుంటాయి. ప్రపంచంలో ప్రప్రథమ నిఘంటువును లాటిన్ భాషలో 1225లో 'జాన్‌గార్లెండ్' అనే ఆంగ్ల పండితుడు వ్రాసాడు. అదే ఆంగ్లభాషలోనిదైతే 1552లో 'రిచర్డ్‌హాలోయెట్' తయారు చేసాడు. దీనిపేరు "Abcdedarium Anglico-Latinum Pro-Tyrunculis" ఇందులో మొదట ఆంగ్లపదాలు, తర్వాత వాటికి ఆంగ్లంలో



అర్థాలు ఆ తర్వా వాటికి లాటిన్‌లో సమానార్థాలు ఉంటాయి. ఇందులో 26,000 పదాలున్నాయి. ఇది అత్యంత ఖరీదైనదవటంగమనార్హం. 'నేటి ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ డిక్షనరీ' ఎంత ప్రాముఖ్యత సంతరింపజేసుకుందో జగద్వితమే. నిఘంటువులలో.. విద్యా నిఘంటువు, న్యాయశాస్త్రశబ్ధకోశం, 'వంశావళి నిఘంటువు- ఇలా అనేక రకాలుంటాయి. నిఘంటువుల ఉపయోగం నిత్య జీవితంలో అత్యవసరమైంది.

-నేమాన సుభాష్ చంద్రబోస్

## గజేంద్రమోక్షం



**భా**గవతపురాణంలోని ఒక గాథ. ఇంద్రద్యుమ్నుడు అను ఒక మహారాజు అడవిలో తపస్సు చేసుకుంటూ ఉండేవాడు. ఒకసారి అగస్త్యమహర్షి ఆ దారిన వెళ్ళడం సంభవించింది. ఇంద్రద్యుమ్నుడు ఘోర తపస్సులో మునిగి ఉండడంవల్ల మహర్షి రాకను గమనించలేక పోయాడు. అందుకు అగస్త్య మహర్షి కోపోద్రిక్తుడై వెయ్యేళ్ళు గజరూపం అనుభవించ వల్సిందిగా ఇంద్రద్యుమ్నుడు మహారాజుని శపించాడు. తత్ఫలితంగా ఆ మహారాజు గజరూపం దాల్చాడు. ఆ ఏనుగు ఇతర ఏనుగుల మందలో కలిసి త్రికూటపర్వత సానువుల్లో ఉన్నవనంలో విహరిస్తూ ఉండేది. త్రికూట పర్వత సానువుల్లోనే దేవలుడు అనే ముని ఆశ్రమం కూడా ఉంది. ఒకసారి హూహూ అను గంధర్వుడు దేవకన్యలతో ఆశ్రమ సమీపంలో విహారానికి వచ్చాడు. అక్కడే ఉన్న ఒక కొలనులో ఆ సుందరాంగులతో నగ్నంగా జలక్రీడలాడడం ప్రారంభించాడు. ఆ దృశ్యం చూసిన దేవలుడు, హూహూ అలక్ష్య ప్రవర్తనపట్ల కోపించిన వాడై గంధర్వుని మొసలిరూపం దాల్చమంటూ శపించాడు. ఒకనాడు ఆ ఏనుగు (ఇంద్రద్యుమ్నుడు) దాహం తీర్చుకొనడానికి గాను ఆ కొలనులో కాలుపెట్టింది. మకరం వెంటనే ఏనుగు కాలును కరచిపట్టింది. అలా ఇద్దరూ (ఏనుగు రూపంలో ఉన్న ఇంద్రద్యుమ్నుడు మకరరూపంలో ఉన్న హూహూ) కొన్నివందల ఏళ్ళు పెనుగులాడి విసిగిపోయారు. చివరకు గజేంద్రుడు దైవాన్ని ప్రార్థించగా వైకుంఠంలో ఉన్న విష్ణుమూర్తి గరుడవాహనారూఢుడై దివినుండి భువికి ఏతెంచి తనచక్రాన్ని మొసలిపై ప్రయోగించగా ఇద్దరూ శాపంనుండి విముక్తులయ్యారు. ఈ గాథను పోతనకవి ఆంధ్రమహాభాగవతంలో చక్కగా వర్ణించాడు.

-పి.ఎం. సుందరరావు

## జోక్స్



### కారణం!

**కష్టమర్** : నేను వచ్చి అరగంట అయ్యింది. నాటేబులు దగ్గరకు ఇప్పుడా రావడం?
**సప్లయిర్**: మీ ప్రక్కనే నాకు వడ్డీకి అప్పుఇచ్చిన ఆయన కూర్చున్నాడు. ఆయనకు ఈ మధ్య కళ్ళజబ్బువచ్చింది. ఇంతసేపు తప్పించుకుని తిరిగాను!వెళ్ళాడుగా వచ్చా!

### దొందు దొందే!

**మొదటి ప్రయాణీకుడు** : ఒకసారి మెయిన్ ఎడిషన్ ఇస్తారా? చదివిస్తా!
**రెండవ ప్రయాణీకుడు**:ఐతే మీ సెల్‌లో బాలెన్స్ వుంటేయివ్వండి! మా ఫ్రెండ్స్ పదిమందికి మిస్సిడ్ కాల్స్ యిస్తా!!

-జె. సుధాకర్ పట్నాయక్

### ప్రత్యేకత




**విలేఖరి వినోద్** : మీరు కొత్తగా ప్రారంభించబోయే హోటల్ ప్రత్యేకత ఏమిటి?
**హోటల్ ప్రొప్రయిటర్ హనుమంతు:** మరేం! జైళ్ళ కెళ్ళొచ్చిన రాజకీయ నాయకులకు జైళ్లల్లో అలవాటైన 'చిప్పకూడు' స్పెషల్ డిష్‌గా ఏర్పాటు చేసాం. తమాషాగా అది క్లిక్ అయింది.

### ఫ్రీగా...

**కరుణాకర్** : ఇడ్లీ ఆర్డరిస్తే దోశ ఫ్రీ, పూరీ ఆర్డరిస్తే ఉప్మా ఫ్రీ అని వెరైటీ స్కీములు పెట్టి, అమ్మకాలు పెంచుకోవాలనుకున్నావు కదా. చివరికేమయింది?
**హోటల్ ప్రొప్రయిటర్**: చివరికి హోటల్ బిల్డింగ్ అమ్మకానికి పెట్టి వంట సామాను ఫ్రీగా ఇవ్వాల్సి వచ్చింది.

– ఓరుగంటి శివరామకృష్ణ

## కవికాలం

### మట్టివిలువ

**మ**నిషి మట్టిలో పుట్టి
మట్టిలో పెరిగి
తుదకు మట్టిలోనే
కలిసిపోతాడు.
మట్టిలో పుట్టిన
మహనీయులు
ఎందరో చరిత్ర సృష్టించారు.
అందరికీ వందనాలు.
అందుకే మట్టి విలువైనది
మట్టి వెలలేనిది
మట్టి మరువలేనిది.

-ఎల్.ప్రపుల్లచంద్ర

### జీవన వేదం

**ధై**ర్యమనే జీవితపడవలో
ఆత్మవిశ్వాసంతో ప్రయాణించే వారికి
ఏటికి ఎదురు ఈత ఈదే విద్య తెలిస్తే!!!
భయం దూరమవుతుంది ఏటిగట్టు దగ్గరవుతుంది!
కష్టసుఖాలు జీవనఅలలు
వస్తూ.. పోతూ వుంటాయి..'నేస్తం'!

### విచిత్ర తేడాలు

**కో**కిల నల్లగావున్నా కూత బహుమిన్న!
మిణుగురు పురుగులు చిన్నవే ఐనా!
కారు చీకటిలో.. కాంతి రేఖలు!
ఆకాశం శూన్యమే ఐనా! ప్రకృతి విచిత్రం!
మేఘాలు! సూర్యుడు చంద్రుడు! చుక్కలు! ఉరుములు! మెరుపులు!
వానలు! ఇంద్రధనస్సు!

-జె. సుధాకర్ పట్నాయక్

## విస్తరాకుపై నీరు పోసినప్పుడు బిందువులు ఏర్పడతాయి ఎందుకు?

**మ**నం విస్తరాకువేసుకొని దానిపై నీళ్ళు చల్లినప్పుడు నీళ్ళు అన్ని చిన్న చిన్న బిందువులుగా మారి విస్తరాకు అంతా ఆవరిస్తాయి. కారణం. ప్రతి ద్రవానికి సహజ రూపం గోళాకారం. ఎందుకంటే ప్రతిద్రవా నికి తలతన్యత (Surface tension ) అనే ధర్మం ఉంటుంది. దాని ప్రకారం ప్రతి ద్రవం అత్యంత కనిష్ట ఉపరితల వైశాల్యం(Surface area ) ను పొందటా నికి ప్రయత్నిస్తుంది. ఒక ఖచ్చితమైన ఘన



పరిమాణం గల పదార్థానికి అతి తక్కువ ఉపరితల వైశాల్యంలో ఏర్పడగల రూపం గోళాకారం. అందుకే గోళాకారం (బిందురూపం) సహజం. అయితే ఈ బిందురూపాన్ని పోగొట్టే అంశాలు రెండున్నాయి. 1.గురుత్వాకర్షణ 2. ఇతర వస్తువులతో ఆకర్షణ. ద్రవం(నీరు) చిన్న, చిన్న భాగాలుగా ఉంటే అందులో భారం తలతన్యత ప్రభావం కన్నా తక్కువగా ఉండటం వలన విస్తరాకు మీద అవి బిందువులుగా ఉంటాయి.

• • • • • • • • • • • • • • • • • • • •





## ఇటలీ

**ద**క్షిణ యూరప్‌లోని స్వతంత్రరాజ్యం. ఒకప్పుడు పవిత్ర రోమన్ సామ్రాజ్యంలో అంతర్భాగం. జూలియస్‌సీజర్. పోప్‌లు, షార్లమాన్ వంటి మహానాయకులు ఏలిన ప్రాంతం. శిల్ప కళాసంపదకు ఇటలీ ప్రసిద్ధి. మైఖేల్ ఏంజిల్. డావిన్సీ వంటి ప్రముఖ చిత్రకారులు ఇటలీ దేశస్థులే. ప్రజలలో 83శాతం రోమన్ కేతలిక్కులు, నాస్తికులు 15శాతం. రాజధాని రోమ్. పో నది ముఖ్యమైన జలాధారం. ప్రధాన పట్టణాలు, వెనిస్, మిలాన్, ట్యూరిన్, జినోవా, పాలెర్మో, బోల్గోనా, ఫ్లారెన్స్, కటానియా, బారీ నేపిల్స్, ఆల్ప్సు పర్వత సానువులలో ద్రాక్షను విరివిగా పండిస్తారు. చెరకు, బాదం, నిమ్మ, నారింజ, ఆలివ్, మల్బరీ, బీటు పంచదార, పొగాకు, టొమాటో కూడా పండుతాయి. బాక్సైట్, మార్బుల్, గంధకం, జింకు, పాదరసం లభించే ఖనిజ సంపద. మోటారుకార్లు, తోలుసామాగ్రి, జౌళి, పెట్రోలియం రసాయనికాలు, ద్రాక్షసారాలు, నౌకానిర్మాణం, ఉక్కు, టైప్‌రైటర్‌లు ముఖ్యమైన పరిశ్రమలు.

-పి.ఎం.

## గమనిక

***హ్యూమర్ బాక్స్‌కి రచనలు పంపేవారు పోస్టుకార్డుపై మాత్రమే రాయాలి. తమ పూర్తి చిరునామా, ఫోన్‌నెంబర్ విధిగా రాయవలసి ఉంటుంది. ఈ నిబంధనలు పాటించిన వారి రచనలు మాత్రమే పరిశీలించబడతాయని గమనించగలరు.***

ఎడిటర్, ఫీచర్స్ సెక్షన్, విశాలాంధ్ర, ఆదివారం అనుబంధం,
గిరిప్రసాద్ భవన్, రాజీవ్ స్వగృహ కాంప్లెక్స్ ఎదురుగా, బండ్లగూడ, జిఎన్ఐ
పోస్ట్, హైదరాబాద్- 500068 ఫోన్ నెం.040-2422 4451
ఫ్యాక్స్: 040-2422 3566. sunday email: **sunvisvj@yahoo.com**

